నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# నల్లగొండ

శుక్రవారం 1 డిసెంబర్ 2023 FRIDAY, DECEMBER 1, 2023 | NALGONDA | పేజీలు PAGES : 12

# పోలింగ్.. 85.49 శాతం

జిల్లాలో సజావుగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

2018 కంటే 1.33 శాతం తగ్గిన పోలింగ్

రాష్ట్రంలోనే అత్యధికంగా మునుగోడులో 91.51 శాతం పోలింగ్ నమోదు

అత్యల్పంగా నల్లగొండలో 81.5 శాతం మాత్రమే ఓట్లు



నల్లగొండలోని ఎంవీఆర్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మునుగోడు మండలం కొంపెల్లిలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు



సూర్యాపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



ఉదయం నుంచే బారులుదీరిన ఓటర్లు

మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటెత్తిన ఓటర్లు

కొన్నిచోట్ల రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

ఈవీఎంలలో భద్రంగా 144 మంది అభ్యర్థుల భవితవ్యం

**జిల్లాలో ఓట్లు, పోలింగ్ శాతం వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|
| దేవరకొండ | 2,51,622 | 83.95 |
| నాగార్జున సాగర్ | 2,33,412 | 85.58 |
| మిర్యాలగూడ | 2,31,391 | 83.47 |
| నల్లగొండ | 2,44,460 | 81.50 |
| మునుగోడు | 2,52,648 | 91.51 |
| నకిరేకల్ | 2,50,547 | 86.67 |
| మొత్తం | 14,64,080 | 85.49 |

11లో..

నల్లగొండ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. ఒకటీ రెండు చోట్ల ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడం మినహా ఎలాంటి సాంకేతిక సమస్యలు సైతం ఎదురు కాలేదు. జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5గంటల తర్వాత కూడా పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలైన్లలో నిల్చుని రాత్రి వరకు ఓపికగా ఉండి ఓటేశారు. 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం 1.33 తగ్గింది. గతంలో 86.82 శాతం ఓట్లు నమోదు కాగా ఈసారి 85.49కు తగ్గింది. యువతతో పాటు పట్టణాల్లో నివసిస్తున్న వాళ్లు సైతం సొంతూర్లకు తరలివెళ్లి పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 91.51 శాతం పోలింగ్ నమోదైంది. నల్లగొండ నియోజకవర్గంలో అత్యల్పంగా 81.5 పోలింగ్ శాతం నమోదైంది. ఆరు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన మొత్తం 144 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం కాగా వాటిని అన్ని నియోజకవర్గాల భారీ భద్రత నడుమ నల్లగొండలో అనిశెట్టి దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించారు. ఈ నెల 3వ తేదీన అక్కడే ఓట్ల లెక్కింపు జరుగనున్నది.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 30 (నమస్తేతెలంగాణ)

# అంచనాల్లో అభ్యర్థులు

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక లెక్కింపు మాత్రమే మిగిలింది. కానీ పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగానే గెలుపోటములపై అంచనాల లెక్కలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమది గెలుపంటే తమదేనన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఎక్కడక్కడ తమకు ఎన్ని ఓట్లు లభించాయో విశ్లేషిస్తున్నారు. అభ్యర్థులు, వారి విజయం కోసం కృషి చేసిన అనుచరులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఇవే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. పెరిగిన పోలింగ్ శాతం, ఆయా గ్రామాలు, పట్టణాల్లో జనం నాడిని విశ్లేషిస్తూ జిల్లా జనం సైతం ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. ఈ నెల 3న నల్లగొండలో 6, సూర్యాపేటలో 4, భువనగిరిలో 2 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే ఈవీఎంలను ఆయా జిల్లా కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరిచారు. ఈవీఎంలు అయినందున మధ్యాహ్నం ఒంటి గంట వరకే పూర్తి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ)




నల్లగొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలకు సీల్ వేస్తున్న సిబ్బంది

11లో..

తమదే విజయం అంటూ అన్ని పార్టీల అభ్యర్థుల ధీమా

బూత్‌ల వారీగా తమకు వచ్చిన ఓట్లపై లెక్కలు

ఏయే ప్రాంతాల్లో ఆధిక్యం లభిస్తుందనే దానిపై అంచనా

ఎవరికి వారుగా విశ్లేషణల్లో మునిగి పోయిన జిల్లా జనం

ఆదివారం ఓట్ల లెక్కింపు.. మధ్యాహ్నానికే ఫలితాలు